క్లుప్తంగా

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు



స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తున్న వ్యాపారులు

కొయ్యూరు: మండలంలోని సింగవరం నుంచి కొయ్యూరు వరకు రహదారికి ఇరువైపులా ఆక్రమణలపై అధికారులు సర్వే చేశారు. ఈ మేరకు సంబంధిత ఆక్రమిత స్థలాలను తొలగించాలని ఆక్రమణదారులకు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపు పనులకు అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు 30 అడుగుల మేర రోడ్డు ఉండాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా రోడ్డును ఆనుకొని షెడ్లు, పాకలను వేశారు. ఇప్పుడు వాటిని స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025–26 సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలు కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు ప్రవేశాలకు దరఖాస్తులను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులు రూ.1450 చెల్లించాల్సి ఉంటుందని , అర్హులైన విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు , నోటుబుక్స్, బ్యాగ్‌లు, ప్రతీ విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాలో రూ.15వేలు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు.అదే విధంగా కళాశాలలో ప్రతీ విద్యార్థికి మధ్యాహ్న భోజన పథకం వర్తిస్తుందన, దూర ప్రాంత విద్యార్థులలో బాలికలకు , బాలురకు వేర్వేరుగా వసతి సదుపాయం ఉన్నట్టు ప్రిన్సిపాల్ శంకరరావు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

అడ్డతీగల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందిస్తారన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైతే వారికి నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



వేడుకలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలోని రామాలయంలో సోమవారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆది విష్ణు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైందవ ధర్మ, సంస్కృతి, సంప్రదాయాలను వివరించారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, స్వామిరెడ్డి, సత్యవతి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, గంగరాజు, పండురెడ్డి, చిన్నబ్బాయి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

అడ్డతీగల: మండలంలోని జాజిపాలెంలో గ్రామంలో పార్వతీ అనే మహిళ ఇంట్లో వంట చేస్తుండగా ఆకస్మికంగా గ్యాస్ స్టవ్ నుంచి మంటలు ఎగసిపడి ఇంటిని చుట్టు ముట్టడంతో తాటాకు ఇళ్లు దగ్ధమైంది. సోమవారం సంభవించిన ఈ అగ్ని ప్రమాదంలో తాటాకు ఇళ్లు దగ్ధమై మహిళ ప్రాణాలతో బయటపడింది . పార్వతి అనే మహిళ వంట చేస్తుండగా మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న నలుగురు సభ్యులు అప్రమత్తమై బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారని స్థానికులు తెలిపారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తాటేకు ఇళ్లు పూర్తిగా అగ్ని ఆహుతి కావడంతో బాధితులు కట్టుబట్టలతో మిగాలారు.

రోజ్‌వుడ్ మంచాలు స్వాధీనం

రంపచోడవరం: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రోజ్‌వుడ్ మంచాలను మారేడుమిల్లి అటవీ అధికారులు పట్టుకున్నారు. మోతుగూడెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో రోజ్‌వుడ్ మంచాలను తరలిస్తున్నట్టు సమాచారంతో బస్సులో తనిఖీ చేయగా మంచాలు బయటపడ్డాయి. రోజ్‌వుడ్ రవాణాపై నిషేదం ఉన్న ఆర్టీసీ బస్సులో తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నిరుపయోగంగా మారిన అరకులోయ తహసీల్దార్ క్వార్టర్స్

సమస్యలతో సతమతం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా క్వార్టర్స్

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలోని తహసీల్దార్ క్వార్టర్స్ నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గతకొన్నేళ్లుగా ఈ క్వార్టర్స్‌లో ఎవరూ నివాసం ఉండడం లేదు. దీంతో క్వార్టర్స్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. ఈ క్వార్టర్స్ సుమారు 30 సెంట్లు పైగా విస్తీర్ణంలో ఉంటుంది. అరకులోయలో భూములకు ప్రస్తుతం విపరీతంగా ధరలు పెరిగి పోవడంతో ప్రభుత్వ స్థలం కనబడితే చాలు కబ్జా జరుగుతుంది. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న తహసీల్దార కార్యాలయం ఎదుట ఉన్న తహసీల్దార్ క్వార్టర్స్ కబ్జాకు గురయ్యే **ప్రమాదం ఉందని స్థానికులు** చెబుతున్నారు. భవనం **శిథిలావస్థకు చేరడం**తో ఎప్పుడే ఏ ప్రమాదం **జరుగుతుందోనని స్థాని**కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ క్వార్టర్స్ నిరుపయోగంగా మారడంతో గత కొన్నేళ్లుగా ఇక్కడ పనిచేసిన తహసీల్దారులందరూ ప్రైవేట్ నివాస గృహాలు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మరికొంత మంది మైదాన ప్రాంతం నుంచి రాకపోకలు సాగించేవారు. రెవెన్యూ సిబ్బంది నివాస గృహాలు సైతం మరమ్మతుకు గురయ్యాయి. ఇప్పటికైన రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ క్వార్టర్‌తో పాటు సిబ్బంది నివాస గృహాలు కూడాబాగుచేసి అందుబాటులోకి తీసుకువచ్చి, ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

> **ప్రతిపాదనలు** పంపాం
>
> **అరకులోయలోని తహసీల్దార్** క్వార్టర్‌తోపాటు **మరమ్మతుకు గురైన ఇతర** సిబ్బంది నివాస గృ**హాలు బాగు చేయాలని కోరు**తూ పాడేరు సబ్ కలె**క్టర్ ద్వారా ప్రభుత్వానికి** ప్రతిపాదనలు పంపాం. **ప్రభుత్వం నిధులు మంజూ**రైన వెంటనే ఉన్నతాధి**కారుల సూచనల మేరకు** తహసీల్దార్ క్వార్టర్‌తో **పాటు రెవెన్యూ సిబ్బంది** నివాస గృహాలు **బాగు చేస్తాం.**
>
> ఎం.వి.వి.ప్రసాద్, **తహసీల్దార్**, అరకులోయ

తడ్డ గ్రామ రహదారికి మోక్షమెన్నడో?

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ తడ్డ పీవీటీజీ గ్రామానికి సరైన రహదారి లేదు. దశాబ్దాలు కావస్తున్నా గ్రామానికి మట్టి రోడ్డుగా గతి అయింది. రాళ్లు తేలిన రహదారిపై స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం పడితే ఈ దారి చిత్తడిగా 2017– 18 సంవత్సరాల కాలంలో ఈ గ్రామానికి పర్యటించిన అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రవీణ్ ప్రకాష్ పూర్తిస్థాయి రోడ్డు మార్గం నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. పూర్తిస్థాయి తారురోడ్డు వేసేందుకు హామీ కూడా ఇచ్చారు. అయినా ఆ హామీ హామీగానే మిగిలిపోయింది. అధ్వాన రహదారి వల్ల గ్రామస్తులకు రవాణా సౌకర్యం లేకుండా పోయింది. వర్షం పడితే ఈ మార్గం చిత్తడిగా మారడంతో కనీసం నడవడానికి కూడా వీలు ఉండడం లేదని స్థానికులు



అధ్వానంగా ఉన్న తడ్డ రహదారి

చెబుతున్నారు. పాదచారులు, వాహనచోదకులు జారిపడి గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో అత్యవసర సేవలు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి పూర్తిస్థాయిలో తారురోడ్డు సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం 101 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 20 మంది హైరిస్క్ గర్భిణులకు గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనకాలిజిస్టు డాక్టర్ సుష్మ, సీహెచ్‌సీ వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



వీర్రాజు (ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత పంచాయతీకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొచ్చా వీర్రాజు సోమవారం రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతి చెందారు. 15 రోజుల క్రితం జడ్డంగి, కొమరాపురం గ్రామాల మధ్య రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో వీర్రాజు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చికిత్స నిమిత్తం ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, జడ్డంగి సర్పంచ్ మురళీకృష్ణ తదితర నాయకులు తదితరులు సంతాపం తెలిపారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



డుంబ్రిగుడ జాతీయ రహదారి వద్ద మానవహారం నిర్వహిస్తున్న సిబ్బంది

హుకుంపేట: జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంపై విస్తృత ప్రచారం జరుగుతుంది. ఇందులో భాగంగా మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వివిధ మండలాల్లో సోమవారం జరిగిన కార్యక్రమాల్లో అధికారులు, వైద్యులు తదితరులు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగాసనాలు వేయడంతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ప్రతి పనిపై పరిపూర్ణమైన ఏకాగ్రత కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలన్నారు. హుకుంపేటలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారావు, సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఎంఈవో ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, మండల యోగాంధ్ర కార్యక్రమం కో–ఆర్డినేటర్, ఆయుర్వేదిక్ వైద్యుడు విజయభాస్కర్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ విజయకుమార్, సచివాలయం, పంచాయతీ, అంగన్వాడీ, వైద్య, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వి.ఆర్.పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధి వేతనదారులు

చింతపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ చంద్రశేఖర్, ఏవో శ్రీనివాస్, తాజంగి ఆస్పత్రికి ,ఉందిన ఉదయ్ సంజీవ్, ఉద్యానవన ఏవో కర్ణ, ఏపీఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమారి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండల కేంద్రంలో డాక్టర్ రాజీవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.బాపన్నదొర, ఈవోపీఆర్‌డీ శివకుమార్, ఆయుష్ వైద్యాధికారి శ్రీహరి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీలో సర్పంచ్ పిట్టా రామారావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రవి, ఉపాధి వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, డ్వాక్రా మహిళలు



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు



వై.రామవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బిర్సా ముండాకు ఘన నివాళి

హుకుంపేట: ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్స ముండా వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మఠం సచివాలయ కేంద్రంలో బీజేపి నేతల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, సిబ్బందితో కలిసి బిర్షముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వతంత్ర్య ఉద్యమంలో బిర్సా ముండా పోరాటం మరువలేనిదన్నారు. పాంగి మత్యకొండబాబు, ఆనంద్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

గంగవరం: మండలంలోని పాతగంగవరంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు విగ్రహ దాతలు కొమ్మన చిన్నారావు, ఆలయ గిరిజన అర్చకుడు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉదయం నుంచి సాయిబాబా వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

దుకాణాల తొలగింపునకు మార్కింగ్



చింతూరులో దుకాణాలకు మార్కింగ్ ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది

చింతూరు: మండల కేంద్రంతో పాటు ఎర్రంపేటలో రహదారికి ఇరువైపులా ఆక్రమణ దుకాణాల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం రెవెన్యూ సిబ్బంది మార్కింగ్ కార్యక్రమం చేపట్టారు. రహదారి మధ్య నుంచి 15 మీటర్ల మేర ఉన్న ఆక్రమణలు తొలగింపులో భాగంగా ఇప్పటికే రెవెన్యూ అధికారులు వ్యాపారస్తులకు నోటీసులు అందజేశారు. తాజాగా దుకాణాలకు మార్కింగ్ కూడా ఇవ్వడంతో వ్యాపారుల్లో గుబులు నెలకొంది. ఇప్పటికే పోలవరం ముంపుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మరి కొన్ని రోజుల్లో వరదలు కూడా రానున్న తరుణంలో తొలగింపు ప్రక్రియ సరికాదని వ్యాపారస్తులు వాపోతున్నారు. పోలవరం ముంపులో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన చింతూరుకు చెందిన నిర్వాసితులు, వ్యాపారులకు పునరావాసంతో పాటు పరిహారం అందిస్తే ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతామని, అంతవరకు దుకాణాల తొలగింపు ప్రక్రియ వాయిదా వేయాలని వారు వేడుకుంటున్నారు. మరోవైపు ఇప్పటికే డ్రైనేజీ వరకు స్వచ్ఛందంగా తమ కట్టడాలను తొలగించుకున్నామని, అధికారులు పోలవరం ముంపుతో పాటు వరదలను దృష్టిలో ఉంచుకొని తమకు కొంత సమయం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ వ్యాపారులు

చింతూరు: మండలంలో రహదారి విస్తరణలో భాగంగా ఆదివాసీ వ్యాపారులకు నష్టం లేకుండా చూడాలని ఆదివాసీ వ్యాపారస్తులు సోమవారం తహసీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల నిర్మించుకున్న గృహాలు, దుకాణాలకు నష్టం వాటిల్లకుండా చూడాలని, ఇప్పుడిప్పుడే ఆదివాసీలు చిరు వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నారని, వారంతా ఉపాధి కోల్పోయే అవకాశముందన్నారు. వ్యాపారాలు కోల్పోయిన ఆదివాసీలకు ప్రభుత్వ స్థలాల్లో ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నరేష్, రాజు, సాయిబాబు, భద్రయ్య, కొండయ్య తదితరులున్నారు.

ఇళ్లు, దుకాణాల తొలగింపు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

రంపచోడవరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రంపచోడవరం ,మారేడుమిల్లి మండలాల్లో రోడ్డు వెడల్పు చేసేందుకు పేద ఆదివాసీలు నిర్మించుకున్న ఇళ్లు, షాపులను కూల్చివేయడం దారుణమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కుంజా దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డిలు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐ.పోలవరం నుంచి భద్రాచలం వరకు ఎటువంటి పనులు మంజూరు కాలేదని , కాని ప్రజల ఇళ్లు, షాపులను కూల్చివేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చట్టవిరుద్ధంగా గృహాలు, షాపులు కూల్చివేయడం ప్రజావ్యతిరేక చర్య అన్నారు. రెండు మండలాల్లో కూల్చివేసిన గృహాలు, షాపులను కూటమి ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియా కూల్చిన భవనాలకు బాధితులకు 5 సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు.

ఎస్టీ చైర్మన్‌ను కలిసిన గిరిజన సంఘం నేతలు



ఎస్టీ చైర్మన్‌ను కలిసి గిరిజన సంఘం నాయకులు

రంపచోడవరం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని ఆదివాసీలు, గిరిజన సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్టీలు ఎదురుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. జీవో నంబర్–3ని పునరుద్ధరించడం, 1/70 చట్టం గిరిజన ప్రాంతంలో పక్కాగా అమలు చేయడంపై విన్నవించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ఆదివాసీ నాయకులు ఆదిరెడ్డి, రంగారావు, మంగిరెడ్డి, బొడ్డగండి, కొండరెడ్డి, అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అవార్డులు



కలెక్టర్ దినేష్‌కుమార్ నుంచి అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు సాయి ప్రదీప్



మంజుల



విజయేంద్ర వర్మ



పిట్టా నాగలక్ష్మి



కొంగ ప్రణవి



ఎస్.కె. సతార్బి




గౌసియా బేగం

రంపచోడవరం: పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేశారు. జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా రూ.20వేలు, మెమెంటో, సర్టిఫికెట్‌లను అందుకున్నారు. ఇందులో భాగంగా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జెడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు అవార్డులు దక్కాయి. ఆయా విద్యార్థులను హెచ్ఎం వి.ముత్యాలరావు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ సామిరెడ్డి వీరభద్ర రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

వి.ఆర్.పురం: మండలంలోని రేఖపల్లి కేజీబీవీలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభకనబర్చి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన పిట్టా నాగలక్ష్మి, కొంగ ప్రణవి విద్యార్థులు కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఆయా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకమ్మ తదితరులు అభినందనలు తెలిపారు.

సీలేరు: జి.కె వీధి మండలం సీలేరులోని డీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్.కె.సతార్బి, ఎం.డి.గౌసియా బేగంలు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో వారు కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డును అందుకున్నారు. ఆయా విద్యార్థులను డీఏవీ పాఠశాల హెచ్ఎం కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

పశు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



పశువుల మందతో రైతు

వి.ఆర్.పురం: పశువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు వీరస్వామి, రాజు, వెంకటేష్, నరేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉండడంతో పశువులు ఎండవేడిమికి అల్లాతున్నాయని అనారోగ్యం బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేయాలని. రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు.

ఒరిగిన భారీ వృక్షం తొలగింపు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ఆర్అండ్‌బీ మార్గంలో లుంగాపుట్టు వద్ద భారీ చెట్టు ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని పలు మార్లు పత్రికల్లో కథనాలు రావడంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. సోమవారం ఆర్అండ్‌బీ అధికారులు లుంగాపుట్టు వద్ద ఒరిగిన ఉన్న చెట్టు తొలగించారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో రెండుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను సైతం ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మునగపాక: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడంతో మెరుగైన దిగుబడులు సొంతం చేసుకోవచ్చని శాస్త్రవేత్త శ్రీహరిరావు తెలిపారు. మునగపాక, ఉమ్మలాడ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతులకు రాయితీపై ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావుతో కలిసి ఆయన వరి విత్తనాలు అందజేశారు. శ్రీహరి రావు మాట్లాడుతూ ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడితే అనర్థాలు తప్పవన్నారు. అధికారుల సలహాలు, సూచనలు మేర ఎరువులు వినియోగించాలన్నారు. ఎంపీపీ జయలక్ష్మి, శాస్త్రవేత్త గౌరీ, అధికారులు లక్ష్మీ ప్రవీణ, పద్మిని, లక్ష్మి, పరశురామ్, ముసిలినాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.